క్లుప్తంగా

డీఈఓకు వినతి



నారాయణపేట ఎడ్యుకేషన్: నవంబర్ నెలలో జరిగిన సామాజిక, ఆర్థిక కుటుంబ సర్వేలో పాల్గొన్న సిబ్బందికి ఐదు సాధారణ సెలవు దినాల్లో పనిచేసినందుకు ఉపాధ్యాయులకు 5 సీసీఎల్‌లు, 2023–04 వేసవి సెలవుల్లో పదోతరగతి పరీక్షలు నిర్వహించిన వారికి ఆర్జిత సెలవుల ప్రొసీడింగ్ మంజూరు చేయాలని కోరుతూ.. డీఈఓ గోవిందరాజులుకి పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు వై. జనార్దన్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి భాను ప్రకాష్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రఘువీర్, ప్రధాన కార్యదర్శి ఎం.జనార్దన్, ఎల్. నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



మక్తల్: మండలంలోని గుడిగండ్లలో మంగళవారం పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన వై. అవినాస్ పెళ్లిరోజు సందర్భంగా దాదాపు 120మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయడంపై వారిని అభినందించారు. కార్యక్రమలలో శ్రీనివాస్‌గౌడ్, నర్సిరెడ్డి, తిరుపతి, రవికుమార్, భరత్‌సింహారెడ్డి, హన్మంతు, హిమబిందు పాల్గొన్నారు.

శానిటైజర్ డబ్బా పేలి ముగ్గురికి గాయాలు



డబ్బు ప్రవీణ్



మ్యాతరి భాస్కర్

మద్దూరు: శానిటైజర్ డబ్బా పేలి ముగ్గురికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మ్యాతర భాస్కర్ తన ఇంటిని శుభ్రం చేసే క్రమంలో ఇంట్లో ఉన్న చెత్తాచెదారం బయటకు తీసి మంటలో వేశారు. ఈ క్రమంలోనే కరోనా టైంలో తీసుకువచ్చిన హ్యాండ్ శానిటైజర్‌ను సైతం బయటకు తీసి మంటలో వేయగా.. పెద్ద శబ్దంతో పేలిపోయింది. అక్కడే ఉన్న మ్యాతరి భాస్కర్, బాలురు డబ్బు ప్రవీణ్, మోనాపురం రాజేష్ శానిటైజర్ వారి శరీరంపై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. చుట్టుపక్కల వారు 108లో మద్దూరు ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ చెప్పారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్‌కు చెందిన మాజీ ఎంపీపీ అంజనమ్మ అనారోగ్యంతో గత రాత్రి మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం గ్రామానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆమె ఎంపీపీగా గ్రామానికి, మండల అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారని కొనియాడారు. అనంతరం బాధిత కుటుంబానికి పరామర్శించారు.

డ్రెయినేజీ నిర్మించాలి

మాగనూర్: మండలంలోని నేరడగంలో పలు కాలనీలలో డ్రెయినేజీ వ్యవస్థలేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. మరోవైపు డ్రెయినేజీ లేకపోవడంతో రోడ్డుపై నీరు వస్తే కాలనీలో నడవలేని దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

స్థల పరిశీలన

కోయిల్‌కొండ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం దగ్గర ఇందిరమ్మ ఇళ్ల నమూనా ఇంటికి మంగళవారం హౌసింగ్ డీఈ పుష్పలత, ఎంపీడీఓ కాళప్ప స్థలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను అందిస్తుందన్నారు. గ్రామాల్లో ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వై.విద్యాసాగర్, నాయకులు సత్యపాల్‌రెడ్డి, యాదవ్‌కుమార్, హన్మిరెడ్డి పాల్గొన్నారు.

- ప్రమాదకరంగా విద్యుత్ తీగలు
- ఒరిగిన స్తంభాలకు మరమ్మతు కరువు
- రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు
- పట్టించుకోని అధికారులు

యమపాశాలు!



దామరగిద్దలో ప్రమాద భరితంగా విద్యుత్ లైన్



వత్తుగుండ్ల ప్రధానరోడ్డు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్

దామరగిద్ద: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు యమపాశాలుగా మారాయి. విద్యుత్ లైన్లు, స్తంభాల నిర్వహణ కొరవడటంతో కిందకు వేలాడుతుండటంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో తెలియని దుస్థితి నెలకొంది. విద్యుత్ ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టడంపై సంబంధిత అధికారులు దృష్టి సారించడంలేదు. మండలంలో గృహ అవసరాలకోసం వినియోగించే విద్యుత్ కనెక్షన్లు 8,580 ఉండగా.. కేటగిరీ–2లో వ్యాపార అవసరాల కోసం 531 కనెక్షన్లు, మిల్లులకు 30 కనెక్షన్లు, వ్యవసాయ అవసరాలకు 5,080 కనెక్షన్లతో కలిపి మొత్తం 14వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

ప్రమాద భరితంగా విద్యుత్ లైన్‌లు..

మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌లైన్ ప్రమాద భరితంగా ఉన్నాయి. మండలంలోని యానుగుంది వెళ్లే ప్రధాన రహదారి సమీపంలోని వ్యవసాయ విద్యుత్ కనక్షన్‌ల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో 11కేవీ విద్యుత్ లైన్‌పైనా ఎల్‌టీ లైన్ ఉండటంతో బలమైన గాలులకు విద్యుత్ లైన్‌లు కలిసి ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నా యి. ఇక వత్తుగుండ్ల సమీపంలో నారాయణపేటకు వెళ్లే ప్రధాన రహదారి విస్తీర్ణం చేపట్టడంతో రోడ్డు పక్కనే ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ రోడ్డు ఎత్తుపెరగడంతో విద్యుత్‌తీగలు ప్రమాద భరితంగా ఉన్నాయి. ఆర్‌అండ్ అధికారులు రోడ్డు ఎత్తు పెంచడంతో ట్రాన్స్‌ఫార్మన్ కట్ట కిందికి అయ్యిందిని ఆర్ అండ్‌బీ అధికారులు కట్ట ఎత్తును పెంచాల్సి ఉంటుందని ట్రాన్స్‌ఫార్మర్ అధికారులు అంటున్నారు. అలాగే కాన్‌కుర్తి సబ్‌స్టేషన్ పరిధిలో ఎస్సీ కాలనీపై నుంచి వెళ్లిన 11కేవీ లైన్‌ను పునరుద్ధరించిన పాత లైన్‌ను తొలగించడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలి



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తన పొలం గట్టుపై ఉంది. 11 కేవీ లైన్ కింద ఎల్‌టీలైన్ ద్వారా తన పొలంలోని విద్యుత్‌బోరు మోటార్‌కు లైన్ తీసుకెళ్లాం. స్తంభం ఒరిగిపోవడడంతో పెద్దగాలులు వీచినప్పుడు ఎల్‌టీలైన్‌కి తగిలి మంటలు వస్తున్నాయి. కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటుచేసి ప్రమాదం జరగకుండా చూడాలి.

– కె. మధుసూదన్‌రెడ్డి, రైతు, దామరగిద్ద

చర్యలు తీసుకుంటాం..

ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను పునరుద్దరిస్తాం. వత్తుగుండ్ల సమీపంలో రోడ్డు విస్తీర్ణం చేపట్టడంతో ట్రాన్స్‌ఫార్మర్ కట్ట ఎత్తు తగ్గడంతో ప్రమాద భరితంగా మారింది. ఆర్‌అండ్‌బీ అధికారులు తమ ఎస్టీమెట్ ప్రకారం కట్ట నిర్మాణం ఎత్తు చేపట్టాల్సి ఉంటుంది. కాన్‌కుర్తిలోని పాత లైన్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– అనిల్‌కుమార్, విద్యుత్ ఏఈ, దామరగిద్ద

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నారాయణపేట: అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు షీ టీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం సింగారం గేట్ వద్ద ఉన్న సోషల్ వెల్ఫేర్ స్కూల్, కళాశాలలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పాఠశాల కళాశాలలో ఎవరైనా ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కి పాల్పడితే చట్ట ప్రకారం చర్యలుంటాయన్నారు. ఎవరైనా వేధింపులకు గురైతే 8712670398కి లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలన్నారు. విద్యార్థి దశ నుంచే చదువుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు షీటీం పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: పార్లమెంట్ 'సాక్షి'గా డాక్టర్. బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. రాజ్యసభలో అంబేద్కర్‌పై హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. ఆయన వ్యాఖ్యలను యావత్ దేశంలోని ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నాయకులు చంద్రకాంత్‌గౌడ్, నారాయణ, రవికుమార్, వెంకటేష్, నాగేందర్, కావలి ఆంజనేయులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు..

నారాయణపేట: కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించి అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం అంబేద్కర్ సమ్మాన్ మార్చ్ ర్యాలీ చేపడుతూ ప్రధాన రహదారి గుండా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను శాసనపల్లి రోడ్డు వద్ద అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించగా ముందుకు కదం తొక్కి కదలారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని నినాదాలు చేశారు. అనంతరం ఏఓ జయసుధకు వినతిపత్రం అందజేశారు. ఈదప్ప, గాజుల శివకుమార్, మనోహర్ ప్రసాద్ గౌడ్, సలీం మహేష్, ఆనంద్ పాల్గొన్నారు.

బీఎస్పీ నిరసన ర్యాలీ..

కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బొదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్‌లో ఏఓ జయసుధకు వినతిపత్రాన్ని అందజేశారు. చంద్రయ్య, వెంకటేష్ ముదిరాజ్, బండారి చంద్రశేఖర్, ఎర్ర హన్మంతు, పాలెం వెంకటయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పేటలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే



గుంటిపల్లిలో ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా చేపడుతున్నామని ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి, కమిషనర్ శశిధర్ అన్నారు. మంగళవారం మండలంలోని గ్రామాల్లో, మున్సిపాలిటీలోని వార్డుల్లో సర్వే కొనసాగిందన్నారు.

కార్మికులకు మెటీరియల్ పంపిణీ

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు సబ్బులు, నూనె తదితర వస్తువులను అందజేసినట్లు ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి తెలిపారు. అలాగే నర్సరీలను సందర్శించి నాణ్యమైన విత్తనాలు వాడాలని నిర్వాహకులకు సూచించారు.

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చి



కొత్తపల్లి: క్రిస్మస్ పర్వదినంను పురష్కరించుకుని మండలంలోని భూనీడు పంచాయతీలో చర్చిని రంగురంగుల విద్యుత్ దీపాలతో చక్కగా అలంకరించారు. నేడు జరిగే క్రిస్మస్ వేడుకను పురష్కరించుకుని మూడురోజుల నుంచి చర్చి పరిసరాలను విద్యుత్ బల్బులతో అందంగా అలంకరిస్తున్నారు. స్వాగత తోరణాలను మెర్క్యురి బల్బులతో తీర్చిదిద్దారు. కొత్త సంవత్సరం వేడుకల వరకు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకుంటున్నారు.

ఓపెన్ అడ్మిషన్‌కు చివరి అవకాశం

మరికల్: ఓపెన్ పదోతరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు పొందేందుకు ఈ నెల 30న చివరి అవకాశమని ఓపెన్ స్కూల్ కో– ఆర్డినేటర్ చెన్నారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యలోనే చదువులు మానేసిన వారికి చక్కటి అవకాశామన్నారు. అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాసిరకం పనులపై చర్యలు తీసుకోవాలి

మరికల్: మండలంలోని ఇబ్రహీంపట్నంలో అమ్మ ఆదర్శ పాఠశాలలో అధికార పార్టీకి చెందిన నాయకులు చేసిన నాసిరకం పనులపై అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ సుజాత, బీఆర్‌ఎస్ నాయకులు రవికుమార్ అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 3లక్షలతో అమ్మ ఆదర్శ పాఠశాలలో తలుపులు, కిటికీలు, మరుగుదొడ్లు, నీటి పైపులకు సంబంధించిన నాసిరకం పనులు చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మనఊరు– మన బడి కింద నాణ్యతతో పనులు చేస్తే, మిగిలిన పనుల విషయంలో అధికార పార్టీ నాయకులు నాణ్యతతో చేయకుండా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ బిల్లులు స్వాహ చేశారన్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి పనులపై విచారణ చేసి నాణ్యతతో మళ్లీ పనులు చేయించాలని వారు డిమాండ్ చేశారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

ఆత్మకూర్: ప్రముఖ సాయిక్షేత్రమైన సాయిబాబా ఆలయంలో మంగళవారం రాత్రి వనపర్తి ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ న్యాయమూర్తి శ్రీలత ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని శ్రీదత్తాత్రేయ స్వామి, సంతాన నాగదేవత, శయనసాయిలను దర్శించుకున్నారు. ఈసందర్భంగా అర్చకులు న్యాయమూర్తిని శేషవస్త్రాలతో సన్మానించి, ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి దివాన్జీ ప్రభాకర్‌రావు, కోర్టు సిబ్బంది, భక్తులు ఉన్నారు.



ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు సూచనలిస్తున్న ఏఎస్‌ఐ ఆంజనేయులు

నారాయణపేట: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందేనని ఏఎస్‌ఐ ఆంజనేయులు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తా ప్రధాన రహదారిపై పేట పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ఉపయోగించాలని, కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలన్నారు. ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా, త్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడపొద్దని సూచించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొద్దని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు.

జాతీయ మార్కెట్ విధానాన్ని ఉప సంహరించుకోవాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కోస్గి: కేంద్రం ప్రభుత్వం అమలు చేయనున్న నూతన జాతీయ మార్కెట్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐపీకేఎస్ జిల్లా కార్యదర్శి నర్సింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పట్టణంలోని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక శివాజీ చౌరస్తాలో కార్పొరేట్ మార్కెటింగ్ జాతీయ విధాన పత్రాలను దగ్ధం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న గత 24రోజులుగా ఢిల్లీ పంజాబ్ సరిహద్దులో అమరణ నిరాహార దీక్ష చేస్తున్న జగజిత్ సింగ్ డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఆ సంఘం నాయకులు నర్సింహాతోపాటు పలువురు పాల్గొన్నారు.

అర్హతలేని సర్టిఫికెట్లు తొలగించాలి



మాట్లాడుతున్న దివ్యాంగుల నాయకులు

నారాయణపేట టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం దివ్యాంగుల సేవా సంఘం జిల్లాస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ అజీమ్ ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్ మాట్లాడుతూ.. దివ్యాంగులంతా ఐక్యంగా ఉండి సామాజికంగా, ఆర్థికంగా బలపడాలన్నారు. తమ పక్షాన చట్ట సభల్లో పోరాటం చేసేవారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హతలేని సదరం సర్టిఫికెట్లను తొలగించాలని, తప్పుడు ధ్రువపత్రాలను జారీచేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. తమకు ఐదు శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, తిరుపతయ్య, రాఘవేందర్, గోపాల్ పాల్గొన్నారు.

భవిష్యత్‌కు పునాది వేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ మురళికృష్ణ

మరికల్: భవిష్యత్‌లో రాణించేందుకు విద్యార్థులు ఇప్పటినుంచి పునాది వేసుకోవాలని చిన్నచింతకుంట ఎంఈఓ మురళికృష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని లాల్‌కోట చౌరస్తా లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన విద్యార్థుల లీడ్‌కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ మేరకు.. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్, వ్యవసాయంపై పలు అంశాలు అధికారులను ఆకట్టుకున్నాయి. పాఠశాలలో విద్యార్థులకు ఇలాంటి కార్య క్రమాలను నిర్వహించి వారిలో ఉన్న మేథశక్తిని బయటకు తీయాలని గుర్తు చేశారు. లక్ష్మన్, రాజేందర్‌రెడ్డి, అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిరసన..

నారాయణ పేట ఎడ్యుకేషన్: స్థానిక మున్సిపాల్ పార్క్ వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె 13వ రోజుకు చేరింది. మంగళవారం ఉద్యోగులు ఒంటి కాలిపై నిలబడి తమ నిరసనను తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, టీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి వారికి మద్దతు తెలిపి మాట్లాడారు.. సమగ్ర శిక్ష ఉద్యోగులు రాష్ట్ర వ్యాప్తంగా గత 15రోజులుగా సమ్మె కొనసాగిస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, వారి న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో రాజశేఖర్, శివకుమార్, వెంకట్రాములు, శశికాంత్, రాములు, గౌరమ్మ, మహేశ్వరి, సునీత, నారాయణ పాల్గొన్నారు.



ఒంటి కాలిపై నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

బీటీరోడ్డు సౌకర్యం కల్పించాలి



నేరడగండొడ్డికి వెళ్లే మట్టిరోడ్డు

మాగనూర్: మండలంలోని నేరడగండొడ్డి రోడ్డు అస్తవ్యస్థంగా మారింది. దశాబ్దాల కాలంగా ఉన్న మట్టి రోడ్లను బీటీలుగా మార్చకపోవడంతో ఆయా గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో వివిధ పనుల నిమిత్తం ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కనీసం ఆటోలు కూడా రావడం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా గ్రామానికి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైన బీటీరోడ్డు పనులు ప్రారంభించకపోవడంతో నిధులు తిరిగి వెళ్లిన దుస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొంతమేర బీటీవేసి వదిలేశారని ప్రస్తుతం కూడా పనులు ప్రారంభిస్తామని, నేటికి అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. ఆయా గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

ఆత్మకూర్: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి కలిగి వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో చోటు చేసుకుంది. ఖానాపూర్‌కు చెందిన శివన్న (35) భార్య సుజాతతో తరుచూ గొడవలు పడుతుండేవాడు. ఈక్రమంలో వారం రోజుల క్రితం భార్య పిన్నంచర్లలోని తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. క్రిస్మస్ పండుగ సందర్భంగా భార్య తన ఇంటికి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన శివ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని గమనించిన చుట్టుపక్కలవారు తలుపులు బద్దలు కొట్టి.. ప్రైవేట్ వాహనంలో ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు శివ అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడు శివన్నకు భార్య సుజాతతో పాటు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని గ్రామస్తులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.